క్లుప్తంగా

దుస్తుల షాపు దహనం



దుస్తుల షాపులో కాలిపోయిన సామగ్రి

రౌతులపూడి: మండలంలోని ఎస్.పైడిపాలలో రామాలయం వెనుక శ్రీకాకులపు దుర్గకు చెందిన దుస్తుల షాపును గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. శనివారం అర్ధరాత్రి ఎవరూ లేని సమయంలో కొందరు వ్యక్తులు షాపులోకి పెట్రోల్ పోసి దహనం చేశారు. షాపులోని దుస్తులు, ఫ్యాన్సీ వస్తువులు, చెప్పులు, జెరాక్స్ మెషీన్ తదితర సామగ్రి కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు బాధితులు తెలిపారు. దీనిపై రౌతులపూడి పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కత్తిపూడిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



కత్తిపూడిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు సర్పంచ్ సత్తిబాబు సూచించారు.

వాకర్స్ క్లబ్‌కు ఉత్తమ సేవా పురస్కారం



ఉత్తమ మెడికల్ సేవ అవార్డును అందుకుంటున్న చదరం శివాజీ

తుని: తుని వాకర్స్ హెల్త్ క్లబ్‌కు వైద్య విభాగంలో ఉత్తమ సేవా అవార్డు లభించిందని క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు కుందెం సత్యనారాయణ ఆదివారం తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ వాకర్స్ సెమినార్‌లో తుని క్లబ్ ఎలెక్ట్ గవర్నర్ చదరం శివాజీకి అవార్డుతో పాటు రూ.10 వేల నగదును అంతర్జాతీయ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఏహెచ్ఎస్ వెంకట్రావు అందజేశారు. తుని వాకర్స్ క్లబ్‌కు అవార్డు రావడం పట్ల క్లబ్ గౌరవాధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు, జూరెడ్డి చిరంజీవి, కండవల్లి జోసెఫ్, డి.సత్యనారాయణమూర్తి, పర్వత బాబూరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

తాళ్లూరులో ఏకాహం



తాళ్లూరులో కోలాటం గురువు శివరామకృష్ణను సన్మానిస్తున్న గ్రామస్తులు

గండేపల్లి: గీతా జయంతిని పురస్కరించుకుని తాళ్లూరు రామాలయంలో ఆదివారం ఏకాహం నిర్వహించారు. మండలంలోని పలు భజనా బృందాల సభ్యులు పాల్గొని నిరంతరాయంగా భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం గ్రామస్తులు కోలాటం గురువు నిమ్మలగడ్డ శివరామకృష్ణను పూలమాల, శాలువాతో సన్మానించారు.

ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు



సాయం కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు

గోకవరం: మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన ఆళ్ల అరవాలు, సరస్వతీ దంపతులకు చెందిన పెంకుటిల్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతింది. దెబ్బతిన్న ఇంటిని రెవెన్యూ అధికారులు, సర్పంచ్ తదితరులు వచ్చి పరిశీలించి వెళ్లారు. కానీ ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందకపోవడంతో వృద్ధ దంపతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు సహాయం అందజేయాలని కోరుతున్నారు.

క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం

- నేడు క్రీస్తు జననం
- ముస్తాబైన ప్రార్థన మందిరాలు
- గ్రామాల్లో పండగ సందడి



తుని జీఎన్‌టీ రోడ్డులో ముస్తాబైన ఎస్ఎంబీ చర్చి



క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన లూథరన్ చర్చి



ఏలేశ్వరం ఆకట్టుకుంటున్న పశువులపాక

ఏలేశ్వరం: క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధమైంది. లోకరక్షకుడైన ఏసుక్రీస్తు జన్మదినాన్ని సోమవారం ఘనంగా జరుపుకొనేందుకు క్రైస్తవులు రెడీ అయ్యారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఆదివారం చర్చిలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రార్థన మందిరాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు ప్రాంతాల్లో క్రిబ్ (పశువులపాక) పాకలను ఏర్పాటు చేసి బాల యేసు విగ్రహాలను నెలకొల్పారు. ఇప్పటికే క్రైస్తవులు తమ ఇళ్లపై రంగు రంగుల స్టార్‌లను ఏర్పాటు చేశారు. ఏలేశ్వరం పట్టణంలోని లూథరన్, ఆర్‌సీఎం, సీఎస్ఐ చర్చిలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆయా చర్చిల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రార్థనలు ప్రారంభించారు. మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, యర్రవరం, సిరిపురం తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.

ఆకట్టుకుంటున్న సెట్టింగులు

క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని చర్చిల ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యుత్ సెట్టింగులు ఆకట్టుకుంటున్నాయి. బాలయేసు పశువుల పాకలో జన్మించినట్టుగా సెట్టింగ్‌లు వేశారు. ఏలేశ్వరంలో నూతనంగా నిర్మించిన ఆర్‌సీఎం చర్చిను సుందరంగా ముస్తాబుచేశారు. స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాల ఎదురుగా ఉన్న లూథరన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు

తుని: క్రిస్మస్ వేడుకలకు నియోజకవర్గంలోని చర్చిలు సుందరంగా ముస్తాబయ్యాయి. సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనల కోసం సర్వం సిద్ధం చేశారు. పట్టణంలోని బాప్టిస్టు చర్చితో పాటు పలు చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం సాయంత్రం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. శాంతాక్లాజ్, క్రీస్తు జననం వివరించే కళాకృతులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రిబ్‌లు, స్టార్‌లు, విద్యుత్ సెట్టింగులు ఆకట్టుకున్నాయి.

గోకవరం: ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండగకు నియోజకవర్గంలోని చర్చిలు సిద్ధమయ్యాయి. సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు క్రైస్తవులు ఏర్పాట్లు చేశారు. గోకవరం మండలంలోని అన్ని చర్చిల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక సెయింట్‌జాన్స్ లూథరిన్ చర్చి, కృష్ణునిపాలెంలోని ఈహెచ్‌హెచ్ చర్చి, రంపయర్రంపాలెంలోని సెయింట్‌జాన్స్ లూథరన్ చర్చి, తంటికొండ, కొత్తపల్లి, కామరాజుపేట, గాదెలపాలెం, ఇటికాయలపల్లి, అచ్యుతాపురం తదితర గ్రామాల్లోని చర్చిలు విద్యుత్ దీపాలతో కళకళలాడుతున్నాయి. ఆయా చర్చిల్లో ఆదివారం రాత్రి నుంచి ప్రత్యేక కార్యక్రమాలు, ప్రార్థనలు నిర్వహించారు.

గోకవరం: ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండగకు నియోజకవర్గంలోని చర్చిలు సిద్ధమయ్యాయి. సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు క్రైస్తవులు ఏర్పాట్లు చేశారు. గోకవరం మండలంలోని అన్ని చర్చిల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక సెయింట్‌జాన్స్ లూథరిన్ చర్చి, కృష్ణునిపాలెంలోని ఈహెచ్‌హెచ్ చర్చి, రంపయర్రంపాలెంలోని సెయింట్‌జాన్స్ లూథరన్ చర్చి, తంటికొండ, కొత్తపల్లి, కామరాజుపేట, గాదెలపాలెం, ఇటికాయలపల్లి, అచ్యుతాపురం తదితర గ్రామాల్లోని చర్చిలు విద్యుత్ దీపాలతో కళకళలాడుతున్నాయి. ఆయా చర్చిల్లో ఆదివారం రాత్రి నుంచి ప్రత్యేక కార్యక్రమాలు, ప్రార్థనలు నిర్వహించారు.

తొండంగి: మండలంలో ఆదివారం క్రిస్మస్ క్యారల్స్ వేడుకలు ఘనంగా జరిగాయి. తొండంగి, బెండపూడి, పి.ఇ.చిన్నాయపాలెం తదితర గ్రామాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. శాంతాక్లాజ్ వేషధారణలో పలువురు అలరించారు. క్రైస్తవులు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి



లింగంపర్తిలో పీఏసీఎస్ భవనం ప్రహరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని లింగంపర్తిలో పీఏసీఎస్ భవనం ప్రహరీని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి పనులను వేగవంతం చేసిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. సీఎం జగన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా పార్థసారథి, నీరుకొండ సత్యనారాయణ, యార్లగడ్డ రాజాచౌదరి, చిక్కాల లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ జోనల్ సమావేశం



జోనల్ సమావేశంలో అవార్డులు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

తుని: స్థానిక నోబుల్ ఐటీఐ క్యాంపస్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ జోనల్ సమావేశం జరిగింది. పలు సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం క్లబ్ సభ్యులంతా కలిసి ఆటపాటలతో ఆనందంగా గడిపారు. క్లాసిక్ డ్యాన్స్, మిమిక్రీ ఆర్టిస్ట్ వి.రాంబాబు ప్రదర్శనలు అలరించాయి. ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన వారికి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కలిదిండి సత్యనారాయణ, ఆర్‌సీ సుధీర్, జీసీ జీవీవీ సత్యనారాయణ, ప్రెసిడెంట్ రావిసుబ్రహ్మణ్యం, కార్యదర్శి ప్రసాద్‌బాబు, కోశాధికారి కోరుబిల్లి సత్తిబాబు, కృష్ణ, చిరంజీవి, గోవిందు, యలమంచిలి, తుని, అన్నవరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ యూత్ కన్వీనర్‌గా నానిబాబు



బండి నానిబాబు

కోటనందూరు: వైఎస్సార్ సీపీ మండల యూత్ కన్వీనర్‌గా మండలంలోని కేఈ చిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన బండి నానిబాబు ఎంపికయ్యారు. సామాజిక న్యాయాన్ని పాటిస్తూ మంత్రి దాడిశెట్టి రాజా దళిత సామాజిక వర్గానికి చెందిన నానిబాబును సిఫార్సు చేశారు. మంత్రి నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని నానిబాబు తెలిపారు. యూత్ కన్వీనర్‌గా ఎంపికైన నానిబాబును ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, లోవదేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జీ, కో ఆప్షన్ సభ్యుడు జిగటాల కోట సత్తిబాబు అభినందించారు.

వైఎస్సార్ సీపీ యూత్ కన్వీనర్‌కు అభినందనలు



తొండంగి మండలం యూత్ కన్వీనర్ నాగేంద్ర

తొండంగి: వైఎస్సార్ సీపీ మండల యూత్ కన్వీనర్‌గా పెరుమాళ్లపురం గ్రామానికి చెందిన గంగిరి నాగేంద్ర నియమితులయ్యారు. మత్స్యకార వర్గానికి చెందిన నాగేంద్రను యూత్ కన్వీనర్‌గా ఎంపిక చేయడంపై పలువురు నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. యూత్ కన్వీనర్ నాగేంద్రకు పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొయ్యా మురళి, జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం గంగబాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గాబు రాజు తదితరులు అభినందనలు తెలిపారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్షలు

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయాల అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేస్తున్న దీక్షలు ఆదివారం కొనసాగాయి. జీతాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు.

పెంట కాలువలు

- చెత్త, వ్యర్థాలతో నిండిపోయిన పంట కాలువలు
- శివారు పొలాలను అందని సాగునీరు
- ఇబ్బంది పడుతున్న రైతులు



అక్రమణకు గురైన ప్రధాన కాలువ



పంట కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

ఏలేశ్వరం: మండలంలో సుమారు 6 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న తిమ్మరాజు చెరువు ప్రధాన పంట కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కాలువలు వ్యర్థాలు, పూడికతో నిండిపోవడంతో దిగువ ప్రాంతాలకు నీరుఅందక రైతులు నష్టపోతున్నారు. ఏలేశ్వరం నుంచి తిరుమాలి వరకు సుమారు నాలుగు కిలో మీటర్ల మేర కాలువలో తుప్పలు పెరిగిపోవడంతో దిగువ ప్రాంతాలకు నీరు అందని పరిస్థితి ఏర్పడింది. కాలువలు గతంలో నాలుగు మీటర్ల వెడల్పు, ఐదడుగుల లోతు ఉండేవి. ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కాలువల్లో చెత్తను తొలగించకపోవడంతో వీటి పరిస్థితి అధ్వానంగా తయారైంది. దిగువ ఉన్న వందలాది ఎకరాలను నీరుఅందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు అనేకసార్లు ఆందోళనలు చేపట్టిన అధికారుల్లో స్పందన లేదు.

అక్రమణల చెరలో కాలువలు

పట్టణంలోని ప్రధాన కాలువలు ఆక్రమణ చెరలో ఉన్నాయి. కాలువను అనుకుని ఉన్న దుకాణదారులు, ఇళ్ల యజమానులు తమ ఇష్టానుసారం నిర్మాణాలు చేపట్టారు. కాలువ రక్షణ గోడలపై కల్వర్టులు నిర్మించారు. దీనిపై అనేకసార్లు రైతులు అధికారులను నిలదీసినా ఫలితం కానరాలేదు. గతంలో పనిచేసిన అధికారులే దగ్గరుండి నిర్మాణాలు జరిపించారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ జరిగి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తీరంలో పర్యాటకుల సందడి



కెరటాల్లో కేరింతలు కొడుతున్న యువత

కొత్తపల్లి: ఉప్పాడ సాగరతీరం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. పర్యాటకులు కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. సెలవు రోజు కావడంతో కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలతో పాటు పిఠాపురం, సామర్లకోట, కిర్లంపూడి, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. ఉదయం తుని సమీపంలో తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానికి తిరిగి సాగర తీరానికి చేరుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా సముద్ర స్నానాలు చేశారు. యువకులు తీరంలో గుర్రపు స్వారీ, మోటార్ సైకిల్ ర్యాలీ, విన్యాసాలు చేశారు. తీరంలో వాలీబాల్, క్రికెట్ ఆడి కేరింతలు కొట్టారు. సముద్ర కెరటాల మధ్య యువకులు చేసిన పిరమిడ్ విన్యాసాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కాగా తీరంలో వసతులు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడ్డారు. కనీసం కూర్చోవడానికి బెంచీలు, తాగేందుకు మంచి నీరు అందుబాటులో లేక పర్యాటకులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.

ఘనంగా హనుమద్వ్రతం



ఏలేశ్వరం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, మహిళలు



ధర్మవరంలో ఆంజనేయస్వామికి పూజలు చేసిన భక్తులు



చినశంకర్లపూడిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం రామదూత హనుమద్వ్రతం వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని ఆంజనేయుని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద స్వామివారికి పురోహితుడు రమణ నేతృత్వంలో కంచర్ల రమేష్, అశ్విని దంపతులు తమలపాకుల పూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కంచర్ల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్, పతివాడ జగదీష్, దాసరి గణేష్, పిరాట్ల రాజా తదితరులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక మార్కెట్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్తిపాడు: మండలంలోని ప్రత్తిపాడు, చినశంకర్లపూడి గ్రామాల్లో ఆదివారం హనుమద్వ్రతం ఘనంగా నిర్వహించారు. స్థానిక జాతీయ రహదారిపై చెక్‌పోస్టు వద్ద గల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నాయకుడు పత్రి రమణ ఆధ్వర్యంలో హనుమద్వ్రతం వేడుకలు నిర్వహించారు. చినశంకర్లపూడిలో అభయ ఆంజనేయ స్వామికి ఏపూరి శ్రీనివాసరావు, అన్నపూర్ణ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సగర సంఘ నాయకుడు ఏపూరి సత్యనారాయణ, చనిపోయిన నాగేశ్వరరావు, ఏపూరి రాంబాబు, గజ్జన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో జువ్వలవారి వీధి రామాలయం వద్ద హనుమద్వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయ్, గ్రామ పెద్దలు సాన నూకరాజు నాయుడు, పెద్దిరెడ్డి కాసులు, భద్రం, కర్రి బాబులు, అద్దేపల్లి రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ పునఃప్రతిష్ఠ పూజలు



డ్రైవర్స్‌కాలనీలో కనకదుర్గమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న పండితులు

గోకవరం: స్థానిక డ్రైవర్స్‌కాలనీలో వేంచేసిన కనకదుర్గమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన పూజలు ఆదివారం ఘనంగా జరిగాయి. అమ్మవారి పాత ఆలయం స్థానంలో నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. గత రెండు రోజులుగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. సోమవారం ఉదయం 8.54 గంటలకు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.